రెబ్బెన: ఎమ్మెల్యే కోవ లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న మండల నాయకులు

తిర్యాణి: ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు

# కోవ లక్ష్మికి శుభాకాంక్షల వెల్లువ

ఆసిఫాబాద్ : కోవ లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు

- కోవ లక్ష్మి గెలుపుపై బీఆర్ఎస్ శ్రేణుల హర్షం
- పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపిన నాయకులు

ఆసిఫాబాద్,డిసెంబర్4: అసెంబ్లీ ఎన్నికల్లో కోవలక్ష్మి భారీ మెజార్టీతో గెలువడంతో నియోజకవర్గంలోని కార్యకర్తలు,నాయకులు,ప్రజా ప్రతినిధులు కోవలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి తన నివాసం వద్ద కార్యకర్తల సందడి నెలకొంది. బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణ, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు చిలువేరు వెంకటేశ్వర్లు, గాదవెణి మల్లేష్,కెరమెరి వైస్ ఎంపీపీ కలాంతో పాటు పార్టీ శ్రేణులు,అభిమానులు, సంఘాల నాయకులు,అధికారులు శాలువాలతో సత్కరించారు.స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోవలక్ష్మి మాట్లాడుతూ, తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకంతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

**● వాంకిడి మండలంలో..**

వాంకిడి,డిసెంబర్ 4: ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి గెలవడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మండలాధ్యక్షుడు, జడ్పీటీసీ అజయ్‌కుమార్ సోమవారం మాట్లాడుతూ, కోవ లక్ష్మి విజయానికి కృషి చేసిన ప్రజలు, మండల నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కోవలక్ష్మి గెలుపొందడంపై అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నేతలు సంబురాలు జరుపుకున్నారు.

**● రెబ్బెన మండలంలో..**

రెబ్బెన, డిసెంబర్ 4: ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన కోవ లక్ష్మికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కెరమెరి :ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానిస్తున్న మండల ప్రజాప్రతినిధులు, నాయకులు

**● బీఆర్ఎస్ నాయకులకు సన్మానం**

జైనూర్ డిసెంబర్ 4 : మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు పార్టీ మండలాధ్యక్షుడు ఇంతియాజ్ లాలా ఖాన్ అబు తాలిబ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావ్, ఫాక్స్ చైర్మన్ కోడప హన్ను పటేల్, సీనియర్ నాయకులు మెస్రం అంబాజి లను సోమవారం మైనారిటీ నాయకులు పూలమాలతో సన్మానించారు. ఆసిఫాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి భారీ మెజార్టీతో గెలుపొందడంతో వారి గెలుపునకు కృషి చేసిన మండల బీఆర్ఎస్ నాయకులకు గ్రామస్తులు మైనార్టీ నాయకులు సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ఇదేవిధంగా ఐక్యతతో ముందుకు సాగాలని బీఆర్ఎస్‌ని మళ్లీ అధికారంలో తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు. మండలంలోని సమస్యలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బియబాని ఫజల్, ఖదీర్ అహెమద్, ఉపసర్పంచ్, ఖాదర్, చాంద్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

**● కెరమెరి మండలంలో..**

కెరమెరి, డిసెంబర్ 4: ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మి ఘన విజయం సాధించడంతో సోమవారం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమె ఇంటికి వెళ్లి శాలువా, పూలమాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలీ వీస్తున్న తరుణంలో ఆసిఫాబాద్‌లో మాత్రం బీఆర్ఎస్ హవా కొనసాగింది. ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో పాటు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు కోవలక్ష్మి విజయంపై పెద్ద స్థాయిలో ప్రచారం చేపట్టి ఆమె గెలుపునకు కృషి చేశారు. ఇదిలా ఉండగా ఆదివాసీల ఓట్లు రాబట్టడమే కాకుండా గిరిజ నేతరుల ఓట్లు బీఆర్ఎస్‌కు పడేలా చేసిన కృషి ఫలించింది. ముఖ్యంగా వైస్ ఎంపీపీ సయ్యద్ అబుల్ కలాం వ్యూహాత్మకంగా తనదైన శైలిలో రంగంలోకి దిగి ఎంపీపీ , పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయితో పాటు మండల స్థాయి క్యాండర్‌తో ప్రచారం చేయడంతో కోవలక్ష్మి గెలుపునకు నాంది పలికింది.

**● తిర్యాణి మండలంలో..**

తిర్యాణి,డిసెంబర్ 4:ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి భారీ మెజార్టీతో విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంపై మండల జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్,సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంతరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్యం రాజయ్య,సామనపల్లి బ్రహ్మం, ఆయా ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ ఈ ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్‌మేడీ కుర్సెంగ మోతిరాం,రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా కార్యదర్శి మడావి నర్సింగరావు, నాయకులు వాసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జైనూర్ : బీఆర్ఎస్ నాయకులను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

ఆసిఫాబాద్ : ఎమ్మెల్యే కోవ లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు

యాసంగికి అలికిన నారుమడి

## యాసంగికి సన్నద్ధం

దహెగాం,డిసెంబర్ 4: మండలంలో రైతులు యాసంగి సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఖరీఫ్ సాగు పూర్తి చేసుకొని తిరిగి యాసంగికి సిద్ధమవుతున్నారు. మండలంలో ప్రధానంగా బోరుబావుల కింద యాసంగిలో వరి సాగు చేస్తారు. రైతులు ప్రస్తుతం నారు మొలుక అలుకడంతో పాటు నారు పొలాలను చదును చేస్తు బిజీ బిజీగా ఉన్నారు రైతులు. ఈ యాసంగి సీజన్‌కు దాదాపుగా మండలంలో 5 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

## డీఎన్‌టీ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం

రెబ్బెన: గోలేటి డీఎన్‌టీ ప్రాథమిక పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, దివ్యాంగులు

రెబ్బెన, డిసెంబర్ 4: మండలంలోని గోలేటి గ్రామంలో ఉన్న డీఎన్‌టీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల విద్యాధికారి ఆదేశాలతో వేడుకలు నిర్వహించినట్లు ఉపాధ్యాయులు సుజాత, స్వప్నలు తెలిపారు. దివ్యాంగులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ముందుగా దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## 8న మండల సర్వ సభ్య సమావేశం

సిర్పూర్(టీ), డిసెంబర్ 4 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చునార్కర్ సువర్ణ అధ్యక్షతన ఈ నెల 8న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీవో రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

## మళ్లీ చలి..

వాంకిడి,డిసెంబర్ 4: కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. కానీ సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో మండలంలో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని పలువురు రైతులు అంటున్నారు.

## మృత దేహం లభ్యం

తిర్యాణి,డిసెంబర్ 4: మండలంలోని ఏదులపాడ్ పంచాయితీ పరిధిలోని చిన్న అరటిపల్లి గ్రామానికి చెందిన ఏదుల పోషం అనే మేకల కాపరి మృత దేహం సోమవారం లభ్యమైనట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. గత కొంతకాలం నుంచి మృతుడు పోషం (ఫిట్స్)మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 29న మృతుడు పోషం మేకలను మేపేందుకు సమ్మక్క,సారక్క అటవీ ప్రాంతం మీదుగా మొర్రిగూడ అటవీ ప్రాంతంలోకి మేకల మందతో వెళ్లి తప్పిపోయాడు. మేకలు ఇంటికి చేరినా రాత్రి కావాస్తున్నా అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా మొర్రిగూడ అటవీ ప్రాంతంలో సోమవారం అతని మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మేకలు మేపుతుండగా అక్కడ ఆకస్మత్తుగా ఫిట్స్ వచ్చి మృతి చెంది ఉంటాడని మృతుని భార్య ఏదుల పద్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 'ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం '

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, డిసెంబర్4 : సిర్పూర్ నియోజకవర్గంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నాని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బహుజన గొంతుకగా నిలిచిన బీఎస్పీకి కొత్త ఆశలు రేకెత్తించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.